# స బ ల

ప్లాట్ ఫాం నుండి ప్యాసింజర్ రైలు కదలబోతూ గట్టిగా కూతవేసింది. క్రింద పచార్లుచేస్తున్న జనం గబగబా పెట్టెల్లోకి జొరబడుతున్నారు. గార్డు రెండుసార్లు గట్టిగా విజిల్ వూది పచ్చజండా వూప సాగేడు.

అదే సమయంలో ఒక ఆడమనిషి తల మీద బరువైన గంపతో రొప్పుతూ రోజుతూ ప్లాట్ ఫాం మీద కొచ్చిపడింది. జనం మధ్య నుండి మెలికలపాములా జొరబడి దగ్గరగా వున్న పెట్టెకేసి పరిగెత్తేసరికి బండిసాగింది. ఆ మనిషి కంగారుపడింది.

ఆమెను ఎరిగున్న రైల్వేకూలీలు "జాగ్రత్తమ్మావ్!" అంటూ కేకలు వేసేరు.

బండి ఎక్కలేకపోతే గంపెడు సరుకు వృధా అయినట్లే. వందరూపాయల నష్టం భరించాల్సి వస్తుంది.

ఆవిడ బండెక్కాలంటే ముందు తల మీదున్న బరువు పెట్టెలోనికి దించాలి. ఆ తర్వాత తనెక్కాలి. వాకిలి దగ్గర నిలుచున్న ప్రయాణీకులు 'ఈ ఆడమనిషి బండెలా ఎక్కగలదో' అన్నట్లు చోద్యం చూస్తున్నారేగాని కాస్త సాయం పడదామన్న జ్ఞానం లేకపోయింది.

"ఏవయ్యో! తోలుబొమ్మలాట సూత్తన్నారేంది! ఎనక్కెల్లండి" కేకలుపెట్టింది కదులుతున్న పెట్టె వెంట పరిగెడుతూనే.

సుబ్బమ్మ కేకలకు వాకిట్లో నిలబడ్డవాళ్ళు ఉలిక్కిపడి వెనక్కు సర్దుకున్నారు. ఆమె గంపను వాకిట్లో కుదేసి, తలకుదురు అందులోకి విసిరి, కమ్మీలు పట్టుకుని వుదుంలా పైకి పాకేసింది. ఆ చాకచక్యానికి చూస్తున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

ఏ కొద్దిక్షణాలు ఆలస్యం జరిగినా బండి ఎక్కలేకపోను.

రైల్వేస్టేషన్ వూరికి దాదాపు కిలోమీటరు దూరంలో వున్నది. అసలు ఆలస్యమంతా బయల్దేరటంలోనే జరిగింది. బండి అందుతుందో లేదోనన్న ఆందోళనతో ఉరుకులు పరుగులమీద వచ్చింది. శ్రమ వృధాకావందుకు సంతృప్తిగా నిట్టూర్చింది.

అసలే కాస్త స్థూలకాయమేమో! దిగచెమటలు పోసేయి. రవిక తడిసి ముద్దయింది. కణతల వెంట చెమట ధారలు కడుతున్నది. తీవ్రమైన శ్వాసకు వక్షం కొలిమి తిత్తిలా

ఎగిరెగిరి పడుతున్నది.

గంపను వాకిట్లోనుండి మెల్లగా లోపలికి లాగి, గోసెను జారవిడిచి చీర సర్దుకుని నిలబడింది అలసట తీర్చుకుంటూ.

"ఏం సుబ్బమ్మా! తీరిగ్గా సాగారొస్తే బండి దొరుకుతుందా?" అన్నాడు సాటి బేరగాడొకడు గారపళ్ళు బయటపడేలా ఇకిలిస్తూ.

కష్టం సుఖం ఎరగకుండా మాట్లాడి నందుకు అతని మీద సుబ్బమ్మకు వళ్లుమండింది.

"నీకేవిరా సెప్తావు! సెట్టుకింద నిలబడి నాలుగు దులుపులు దులిపి గంపనేసుకొత్తావు. సీకట్నేలేచి ఇంటింటికి తిరగాలా! గుబులుమారి గేదె వకటి సేపకుంటే పాలు పొద్దు పొకిపోవటానికి. వకమ్మ సందుజూసి నీల్లు గలపాలని సూత్తది. ఇంకోయమ్మ కొలత టోకర ఎయ్యాలని సూత్తది.... మా బాధలు నీకేటి తెల్సు. పట్నం సికాదెల్లినట్టు నాలుగీధులు తిరిగి రెండుపదులు వడుక్కుంటావ్" సుబ్బమ్మ నాలుగు జాడించి పారేసింది.

"ఏదోనే అప్పా! పరదాకన్నా, కష్టమెట్టుకోక" అన్నాడు అతడు బెదిరిపోయి.

"పరదాకి మాత్రం సమయం వుండొద్దా" అన్నది మెత్తబడుతూ.

అతడు మరలా నోరెత్తలేదు. సుబ్బమ్మ తత్త్వం తెలిసుండి ఆమెను కదిలించినందుకు మనస్సులోనే బుద్ధి చెప్పుకున్నాడు.

ఆమెతో ఏం మాట్లాడాలన్నా వళ్ళు దగ్గరుంచు కోవాల్సిందే. ఆ నోటి దురుసుకు ఎలాంటి వాళ్ళయినా గజగజ లాడిపోవాల్సిందే. అలాగని చెడ్డది కాదు.

సాటిబేరగాళ్ళు ఎవరైనా కష్టంలో వుంటే పదోపరకో చేబదులిచ్చి ఆదుకుంటుంది. కాస్తో కూస్తో పెరుగు మిగిలినప్పుడు అడిగిన వాళ్ళకు నీళ్ళు తొలిపి దాహానికిస్తుంది. మాట దురుసయినా మనస్సు మెత్తన.

బండి వేగం అందుకోవటంతో చల్లగాలి శరీరానికి తగిలేకొలది సుబ్బమ్మకు ప్రాణం కుదుటబడ సాగింది.

బండి దిగినప్పటినుండి మళ్ళీ బస్తీలో పరుగులు పెట్టాలి. బండి విజయవాడ చేరటానికి అరగంటపైనే పడ్తుంది గనుక ఎక్కడన్నా కాస్త జాగా చూసుకుని చతికిలబడదామని గంప జరుపుతూ పెట్టె లోపలికి వెళ్లింది.

చుట్టూ కలయజూసింది. పెట్టంతా ప్రయాణీకులతో నిండి వుంది. అక్కడక్కడా కొందరు నిలబడున్నారు.

ఒక బల్లమీద మాత్రం నలుగురు బక్కపల్చటి వాళ్ళు కూర్చుని పగలబడి నవ్వుకుంటూ అల్లరి చేస్తున్నారు. ముందు చూడగానే వాళ్ళను మగ పిల్లలనుకున్నది. కాని అటు చివరిగా కిటికీ ప్రక్కన వోణితో ఉన్న అమ్మాయిని చూసి మిగిలిన ముగ్గురూ మగ పిల్లల్లా బట్టలువేసుకున్న కాలేజీ అమ్మాయిలని గ్రహించింది.

గంపను ఒక ప్రక్కకు సర్ది, "కాస్త జరుగుతారూ" అన్నది మర్యాదగా.

జీన్స్ వేసుకున్న ముగ్గురి ముఖాలూ ముటముటలాడి పోయాయి.

నెల్రకితం వాళ్ళు సుబ్బమ్మతో ఘర్షణపడ్డారు. బండిలో నుండి నింపాదిగా దిగుతున్న సుబ్బమ్మను దాటుకుని ఆ ముగ్గురూ ప్లాట్‌ఫాం మీదకు దూకుడుగా దిగబోతుంటే

ఎవరిదో చేయితగిలి మట్టిమూకుడు వారిలో ఒకరిమీద పడింది. పెరుగు చిదపలు బట్టలపైన చిందాయి.

వాళ్ళకు ఉక్రోషం ముంచుకొచ్చింది. "యూఫూల్! కనపట్టంలా!" ఒకమ్మాయి నోరు జారింది.

ఇందులో తన తప్పెంతవరకో గ్రహించుకోకుండా మాటతూలినందుకు సుబ్బమ్మకు కోపం వచ్చింది.

"ఫూలేమిటి పిల్లోయ్! మాట మీరితే పల్లురాల్తాయి" అన్నది.

"నువ్వే రాలగొట్టించుకుంటావ్" అన్నారు ముగ్గురూ.

చదువుకునే ఆడపిల్లలంటే గౌరవంగా చూసే మనిషి కూడా ఆ క్షణంలో తమాయించుకోలేకపోయింది.

గభాల్న గంప క్రిందకు దించి "ఎనకాముందూ సూడకుండా వాగుతున్నారు. రండి రాలగొడ్తురుగాని" అంటూ కళ్ళలో నిప్పులు కురిపించింది.

ఆ స్థితిలో సుబ్బమ్మను చూస్తేనే వాళ్ళ గుండెలు దడదడలాడేయి. కిక్కురుమనకుండా ముందుకు సాగిపోయారు.

ఆనాటి సంఘటనను సుబ్బమ్మ అంతటితోనే మర్చిపోయిందిగాని వాళ్ళకు ఇంకా జ్ఞాపకం వున్నది.

"ఎక్కడుందిచోటు?" అంటూ ముఖాలు తిప్పుకున్నారు.

"కాస్త సర్దుకుంటే మీ సొమ్మేంపోదులేమ్మా! బండి దాటిపోద్దేమోనని పరుగుల మీదొచ్చా! గుండె బరువుగా వుంది" అన్నది ప్రాథేయపూర్వకంగా.

"కంట్రీరోగ్! చెప్తుంటే అర్థంకాదు" ఒకమ్మాయి పీమటపాకాయలా పేలింది.

వాళ్ళ పెడసరానికి కోపం వచ్చినా నిగ్రహించుకున్నది సుబ్బమ్మ.

వోణీ వేసుకున్న అమ్మాయి సుబ్బమ్మను చూసి జాలిపడినట్లుంది. లేచి ఇవతలకు వచ్చింది.

"పోనీలేవే పాపం! మీరటు జరగండి. నేనిటు కూర్చుంటాన్లే" అన్నది సామరస్యంగా.

ముగ్గురూ ఆ పిల్లకేసి నిరసనగా చూసేరు. సుబ్బమ్మ తమ ప్రక్కన కూర్చోవటమే అవమానంగా భావించారు.

"ప్లీజ్" అన్నది వోణీ అమ్మాయి అభ్యర్థనగా.

ఎదురు బల్లమీద కూర్చున్న మగాళ్ళు కూడా, "కాస్త సర్దుకోండమ్మా!" అన్నారు.

ముగ్గురూ విసురుగా అవతలకు సర్దుకున్నారు. ఆ విసురులోనే వాళ్ళ అయిష్టత వ్యక్తమైంది.

వోణీ అమ్మాయి కూర్చుంటూ "ఇక్కడ కూర్చో!" అంటూ చోటిచ్చింది.

ఆ పిల్ల మంచితనానికి సుబ్బమ్మ ఎంతో ముచ్చటపడింది.

"బంగారు తల్లీ! సదువుకున్నోల్లయితే మాత్రం నేలమీద నడవొద్దూ!" అంటూ ఒక చురకవేస్తూ స్థూలకాయాన్ని అంచున చేరవేసింది.

గంపలోనుండి తల కుదురు అందుకుని విప్పి ముఖానికి చేతులకు పట్టిన చెమట తుడుచుకుంటూ, "ఏ వూరు బుల్లె మువ్వి!" అడిగింది ఆత్మీయంగా.

ఆ పిల్ల చెప్పింది.

"అయితే మా పక్కూరేనన్నమాట, ఎవరమ్మాయివి?"

"దశరథరామయ్య గారమ్మాయిని!"

"ఆ మారాజు బిడ్డవాతల్లే! ఆరికి తగ్గ కూతురివే. సుట్టుపక్కల ఆయన్నెవరెరుగర్లే!" అన్నది సంభ్రమంగా.

సుబ్బమ్మ ప్రశంసకు ఆపిల్ల కాస్త సిగ్గుపడింది.

"పట్నంలో సదూకుంటన్నావా?"

తలూపింది మౌనంగా.

"బాగాసదూకోమ్మా! కాలాన్ని బట్టి ఆడోల్లు కూడా అన్నిట్లో ముందుండాలి" అన్నది.

"డర్టీక్రీచర్! చెమట కంపు, ఎంత పన్నీటితో కడిగినా ఆ కంపు దానికే అంటుకు పేట్లుంది" ఇంగ్లీషులో అన్నది సుబ్బమ్మ నుద్దేశించి దగ్గర్లో కూర్చున్న జీన్స్ అమ్మాయి, ముక్కు దగ్గర చేత్తో గాలి చెదరగొడ్తూ.

ఆ మాటలకు మిగతా వాళ్ళు నవ్వేరు. తన నుద్దేశించే వాళ్ళు నవ్వుతున్నారని సుబ్బమ్మ గ్రహించి ముఖం చిట్లించుకున్నది. ఏదో పిల్లచేష్టలు పోనీలెమ్మనుకున్నది.

నలుగురున్నకాడ వద్దికగా, మర్యాదగా వుండాల్సింది గుట్టుమట్టు లేకుండా ఏమిటే ఇకఇకలు, పకపకలు అనుకున్నది మనస్సులోనే.

సుబ్బమ్మ పల్లెటూరి మనిషే అయినా పట్నం పోకడలు ఎరగనిదేం కాదు. అదేదో గొప్పగా ఆడపిల్లలు మగవాళ్ళ బట్టలేసుకోవటం, వాళ్ళలా గంతులు పెట్టడం సుబ్బమ్మకు సహించదు. ఇవన్నీ మాయదారి సినిమా పోకడలని చిరాకుపడ్తుంది.

పెట్టెలో వున్న మిగతా ప్రయాణీకుల కళ్ళన్నీ ఆడపిల్లల మీదనే వున్నాయి. వాళ్ళు చేసే అల్లరి వినోదంగా వున్నది.

సుబ్బమ్మ తన సంసారం, వ్యాపారం తప్పించి మరేగొడవ పట్టించుకోదు. నిద్రలేచిన ప్పట్నుండి గానుగెద్దులా కష్టపడుతుంది. మొగుడికి ఒక ఎకరం మాగాణి వున్నది. తిండి గింజలకు లోటుండదు. దానితోపాటు వ్యవసాయం. పనులున్న రోజుల్లో కూలికెళ్తాడు. లేనిరోజుల్లో అదని ఇదని చూడకుండా ఏపని దొరికినా రెక్కలు ముక్కలు చేసుకుంటాడు.

సుబ్బమ్మ పుట్టింటివాళ్ళు కాయకష్టంతో బ్రతికేవాళ్ళే. చిన్నప్పట్నుండి వాళ్ళతో పాటు కష్టపడటం నేర్చుకున్నది. పెళ్ళయి అత్తవారింటికొచ్చినా వళ్ళొంచి పని చేయడం మానలేదు.

కేవలం మగాడి సంపాదన మీదనే పెళ్ళాం, పిల్లలు బ్రతకాలనుకోవటం సుబ్బమ్మకు ఏమాత్రం నచ్చదు. ఆడది గడపదాటి పనిచేయటానికి ఇష్టపడని మగాళ్ళంటే ఆమెకు తగని కోపం.

"మొగుడూ పెళ్ళాం జోడెద్దుల్లా లాగితేనే సంసారం సజావుగా సాగిపోద్ది. ఒకడి చేతులుకేసి పదిపొట్టలు ఎదురు సూట్టం ఈ కాలంలో ఎంతనేయం?" తరచూ అంటుంటది ఎవరైనా కదిలిస్తే.

బాగా చీకటినే నిద్రలేస్తుంది. అగ్గిరాజేసి అన్నం, కూరలు వండుతుంది. కూలికెళ్ళే మొగుడి కోసం సత్తు క్యారియర్‌లో అన్నం సిద్ధం చేస్తుంది. గబగబా నాలుగుముద్దలు

తిని గంపనెత్తినేసుకుని ఇళ్ళవెంట బయల్దేరుతుంది.

మగవాళ్ళతో సమానంగా ఆడవాళ్ళకు కూలి ఇవ్వకపోవటం, సంవత్సరం పొడుగునా కూలి సరిగా దొరక్కపోవటంతో బాగా ఆలోచించి ఈ వ్యాపారంలోకి దిగింది సుబ్బమ్మ. పాలు, పెరుగు మీద రోజుకి పదిరూపాయలకు తక్కువ సంపాదన వుండదు.

సుబ్బమ్మ బైటకు వెళ్ళినా ఇల్లు కని పెట్టుకోవడానికి, పిల్లలకు వేళకింత అన్నం పెట్టి బడికి పంపటానికి ముసలి అత్త వున్నది. మొగుడు కూడా చద్దన్నం తిని సుబ్బమ్మతోపాటు కుడిఎడంగా కూలికెళ్తాడు.

ఇంటింటికి వెళ్లి దగ్గరుండి పాలు పిండించుకుంటుంది. పాలలో నీళ్ళచుక్క కలవటానికి ఒప్పుకోదు. ఇళ్ళన్నీ తిరిగి పాలు పితికించు కొనేసరికి దాదాపు ఆరున్నరవుతుంది. హడావుడి పడ్తూ స్టేషనుకు సరిగ్గా బండి వచ్చే సమయానికి చేరుకుంటుంది.

బండి ఎనిమిది గంటలలోపే విజయవాడ చేరుతుంది. దిగీ దిగటంతోనే వతనున్న ఇళ్ళవెంట పరుగులు తీస్తుంది. వలుగురి కన్నా పావలా, అర్ధ ఎక్కువే తీసుకున్నా చిక్కటి పాలు పోసే సుబ్బమ్మను అందరూ ఇష్టపడతారు.

తొమ్మిదిగంటలకల్లా పెరుగు అమ్మకానికి బయల్దేరుతుంది. ఆ పేటలోనే బీదా బిక్కీ జనం వుండే సెంటరుకు వెళ్ళి ఒక చెట్టునీడన గంప ముందేసుకు కూర్చుంటుంది. సుబ్బమ్మ తెచ్చే తియ్యటి గడ్డపెరుగు కోసం ఎదురు చూసే ఖాతాలు అక్కడా బాగానే వున్నాయి. అర్ధగంటలో అమ్మకం పూర్తి చేసుకుంటుంది.

ఆ తరువాత పండ్లమార్కెట్‌కి వెళ్తుంది. సీజనుబట్టి దొరికే పండ్లలో ఆరోజుకి చవకనిపించిన రకం కొనుగోలు చేసి పదకొండు గంటలకల్లా స్టేషన్‌కు చేరుతుంది.

పదకొండుంబావుకి తిరుగు బండి. పన్నెండు గంటలకల్లా వూరిలో దిగుతుంది. ఇంటికి చేరుతూనే వంటిమీద కాసినినీళ్ళు గుమ్మరించుకుని, అన్నం తిని కొద్దిసేపు కునుకుతుంది.

కాస్త చల్లబడ్డాక లేచి గంపనెత్తినేసుకుని వూళ్ళో తిరుగుతూ పట్నం నుండి తెచ్చిన పండ్లు అమ్ముతుంది. సాధారణంగా ఎక్కువ భాగం పాలు పోసేవాళ్ళే కొంటుంటారు. సుబ్బమ్మ కూడా మరీ లాభం ఆశించదు.

సాయంత్రం కూడా ఐదారులీటర్ల పాలు పెరుగు తోడు పెట్టటానికి పితికించుకొని ఇంటికి చేరుతుంది. పాలు కాగబెట్టి ఒక ప్రక్కన చల్లారబెట్టి వంటకు సిద్ధపడ్తుంది. ఆ సమయంలోనే మొగుడితోనైనా, పిల్లలతోనైనా కాసేపు కాలక్షేపం చేసే వ్యవధి. అందరిభోజనాలై, పిల్లలు కాసేపు చదువుకున్నాక పక్కలు పరుచుకుని పడుకుంటారు.

సుబ్బమ్మ చాలా జాగ్రత్త మనిషి. ఖర్చు పెట్టేటప్పుడల్లా ఆ సంపాదనకు పడ్డ కష్టం గుర్తుంచు కోవాలంటుంది. మొదట్లో మొగుడికి బీడీలు తాగడం, అప్పుడప్పుడు సారా చుక్క వేసుకోవటం అలవాటుండేది.

"ఏమయ్యా! పెట్టేకర్చు ఇంటికో వంటికో లాభిస్తుందా లేదా అని చూడాలి. మనలాటోర్ల సంసారాలు సగం గుల్లవుతుంది, ఇట్టాంటి పెద్ద అలవాట్లతోనే కాదా!" అంటూ మొగుడ్ని విలదీసింది.

అంతే! అతను మళ్ళీ ఆ చెడ్డ అలవాట్ల జోలికి పోలేదు.

అంత జాగ్రత్త గల మనిషి గనుకనే కాపురానికొచ్చిన కొన్నేళ్ళకే వున్న పూరిపాక పడగొట్టించి రాతి గోడలతో రెల్లు ఇళ్లు నిలబెట్టించ గలిగింది. రేపో మాపో రెల్లు తీసి పెంకు కప్పాలని ఆలోచిస్తున్నది కూడా!

సుబ్బమ్మ పడ్తున్న కష్టానికి జాలిపడ్తూ ఒకరోజు మొగుడు, "ఇప్పుడు తింటానికేం లోటు లేకుండా సాగిపోతుంది గదా! నీకింకా ఎందుకింత శ్రమ! ఇంటి పట్టున కూకుండ రాదూ!" అన్నాడు అభిమానంగా.

ఆ మాటలకు అతనిమీద ఎగిరిపడింది. "ఏందయ్యా! నే శ్రమపట్టం నీకు నామోషిగా వుందా లేక లంకెబిందె లేమన్నా దొరికినయ్యా! కష్టం సేయగలం గనక ఇయ్యాల జరుగుబాటు సరేనయ్యా! ఎల్లకాలం ఇట్టానే సేయగలమా! ఇప్పుడుపడే కష్టమే రేపు లేవలేని వయసులో ఇంత ముద్దేసుద్ది" ఆ మాటలకు మళ్ళీ నోరెత్తలేదు అతను.

బండి ప్రక్క స్టేషన్లో ఆగింది. ఒక కుర్రకారు గుంపు పెట్టెల వెంట పరుగులు పెడ్తూ కిటికీలగుండా లోపలికి తొంగిచూస్తూ ఒకటే అల్లరి. బండి కదల బోతుండగా కిటికీ గుండా సుబ్బమ్మ వున్న పెట్టెలోకి తొంగి చూసి, "హాయ్!" అంటూ వెర్రికేకలు పెట్టి లోపలకు గెంతారు.

మొత్తం అరడజను మంది వున్నారు. భుజాలదాకా పెరిగిన జుట్టు, చెంపలుదాటిన పట్టీలు, గోనె పట్టాల్లాంటి ముతక బట్టలతో వికారానికి ప్రతినిధుల్లా కనిపిస్తున్నారు. లోపలికి ఎక్కుతూనే ఆడపిల్లలు కూర్చున్న బల్ల దగ్గరగా చేరి ఒక్కటే గోల.

"లవ్....లవ్....లవ్ మీ నెరజాణ...." ఒకడు పాట అందుకున్నాడు. మిగిలిన వాళ్ళు చెక్కల మీద దరువేస్తున్నారు.

కాలేజీ పిల్లలు బండ్లలో కాస్తో కూస్తో అల్లరి చేయటం సుబ్బమ్మ ఎరుగును. కాని ఇంత అల్లరిముఠా ఇంతవరకూ తారసపడలేదు. ఏ అడవిమందో దారి తప్పినట్లుందనుకొన్నది.

ఒకడు జేబులోనుండి సిగరెట్ తీసేడు. జీన్స్ వేసుకున్న అమ్మాయి మీదకు వంగి, "మిస్టర్! కాస్త అగ్గిపెట్టె ఇస్తావు" అన్నాడు మెలికలు తిరుగుతూ.

ఆ అమ్మాయి కోపంగా ముఖం తిప్పుకున్నది.

"మిస్టర్ కాదురా! మిస్....మిస్....ఇదుగో మేచప్" అంటూ ఒకడు వెకిలిగా అరిచాడు.

"సారీమిస్టర్....మిస్....సారీ!" అన్నాడు వాడు అగ్గిపుల్ల వెలిగించి సిగరెట్ అంటిస్తూ.

మిగిలిన వాళ్ళు ఈలలు వేసి ఒకటే అరవటం.

వాళ్ళ అల్లరికి ఆడపిల్లల ముఖాలు కందగడ్డల్లా అయ్యాయి. వాళ్ళను ప్రతిఘటించే ధైర్యంలేక బితుకు బితుకుమంటూ కూర్చున్నారు.

ఒక ముసలాయన కలగజేసుకున్నాడు. "కాసేపు నిశ్శబ్దంగా కూర్చోక ఏమిటీ గోల!" అన్నాడు మందలింపుగా.

"ఎక్స్‌క్యూజ్‌మీ తాతగారూ!" అన్నాడొకడు చేతులు జోడిస్తూ వ్యంగ్యంగా.

మరొకడు ఆయన మీసాలు మునివేళ్ళతో దువ్వుతూ, "మీకు రోషం బాగున్నట్లుంది. మీసాలకు సంపెంగ నూనె రాస్తారా తాతగారూ!" అన్నాడు మీసాలు చురుక్కుమనేలా

గుంజుతూ
ఆ చురుక్కి ముసలాయన ఎగిరిపడ్డాడు. అంతా గొల్లున నవ్వేరు.

"మీ బట్టతల మాయ అద్దంలా తళతళా మెరుస్తున్నది. రోజూ దేంతో పాలిష్ చేస్తారూ?" అంటూ వేళ్ళు ఆయన తలమీద టకటక లాడించేడు.

ఆ ముసలాయన బిక్కచచ్చిపోయాడు. కిక్కురుమనకుండా లేచి అవతలకు వెళ్ళి పోయాడు. కుర్రకారు ఒకటే చప్పట్లు కొట్టడం. ఆ ఖాళీలో ఒకడు చతికిలబడ్డాడు గభాల్న. తన కాళ్ళు ముందుకు జాపి ఆడపిల్లల కాళ్ళకు తగిలిస్తూ వినోదిస్తున్నాడు.

తలో సిగరెట్టు వెలిగించి గుప్పగుప్పన ఆడపిల్లల ముఖాల మీదుగా వూదుతున్నారు. ఆ పొగతో వాళ్ళకు కంపరమెత్తిపోతున్నది. అంతదాకా అల్లరిచేసిన ఆడపిల్లలు వీళ్ళదెబ్బకు నిస్సహాయంగా బెదురుచూపులు చూస్తున్నారు.

బండి ప్రక్క స్టేషన్ వదిలింది. కుర్రమూక అల్లరి పేట్రేగి పోతున్నది. వాళ్ళ అసభ్య ప్రవర్తనకు పెట్టెలో అడ్డుచెప్పే వాళ్ళు లేకపోయారు.

సుబ్బమ్మకు మాత్రం వంట్లో సెగలు పుడ్తున్నాయి. అంత అల్లరిని భరిస్తూ రాతిబొమ్మల్లా కూర్చున్న అమ్మాయిల చేతగానితనం ఆమెకు తగని చిరాకు తెప్పిస్తున్నది. పిల్లల గొడవలో తానుగా జోక్యం చేసుకోవడానికి వెనుకాడుతున్నది.

ఇంతలో ఒకడు కూర్చొని కాళ్ళు తగిలిస్తున్న వాడి దగ్గరకు వెళ్ళి "సర్దుకోవోయ్" అంటూ ఏకంగా వాడి వొడిలోనే కూర్చోబోయాడు.

"ఇక్కడ చోటెక్కడిదోయ్" అంటూనే వాడు కూర్చోబోతున్న వాడికి చేతులడ్డం పెట్టి ముందుకు నెట్టాడు.

ఇదే తగిన అవకాశంగా రెండోవాడు ముందు బల్లమీదున్న ఆడపిల్లల మీద పడ్డాడు. వాళ్ళంతా కెవ్వుమని అరుస్తూ లేచేరు భయంగా.

బల్లమీద పడ్డవాడు లేవబోతున్న వోణీ అమ్మాయి కొంగు దొరక బుచ్చుకుని ఒక్క గుంజు గుంజాడు. దాంతో ఆ పిల్ల దభేల్న వాడి మీద పడిపోయి బేలగా అరిచింది.

"ఛాన్స్... ఛాన్స్... డోంట్ మిస్... డోంట్ మిస్..." కుర్రగుంపు గోలగా అరిచారు.

సుబ్బమ్మలో సహనం కట్టలు తెంచుకున్నది. వెర్రికేక పెడ్తూ అపరకాళిలా లేచింది.

ఆ అమ్మాయిని ఇవతలకు గుంజి, వాడి జుట్టుపట్టుకొని లేపి బలంగా ఒక్క కుమ్ము కుమ్మింది. తలపైనున్న చెక్కకు గుద్దుకొని బాధగా అరుస్తూ కింద కూలబడ్డాడు.

మరొకడు 'యాహూ!' అంటూ పొలికేక వేస్తూ సుబ్బమ్మ కేసి దూకబోయేడు.

"మాకాలమ్మ తల్లే!" అంటూ వాడి మెడవడిసి పట్టుకుని, మోకాలు వంచి డొక్కలో ఒక్కపోటు పొడిచింది. గావుకేకతో ఎగిరి కిందపడ్డాడు రెండోవాడు. సాహసించి ముందుకొచ్చిన మూడోవాడికీ అదే శాస్తి జరిగింది.

"రండిరా నాయాల్లారా! ఆడోల్లంటే అంతలుసురా మీకు! మీ రగతం తాగుతానేమ మకున్నారో!" అంటూ వీరంగం వేసింది గోసె బిగలాగి.

కుర్రమూక గుండెల్లో దడ పుట్టింది. సుబ్బమ్మ మీదకు చేయి ఎత్తే ధైర్యంలేక వెర్రిచూపులు చూసేరు. పిడికిళ్ళు బిగించి పళ్ళు పటపట లాడిస్తున్న సుబ్బమ్మను

చూస్తుంటే కాళికాదేవి ప్రత్యక్షమైనట్లుగా వణుకుపుట్టింది.

ఇంతలో ప్రక్క స్టేషన్లో బండి ఆగటం గమనించి అక్కడ్నుండి మెల్లగా జారుకున్నారు. వాళ్ళు మరలా తిరిగొచ్చి ఏం గొడవ చేస్తారోనన్న భయం పట్టుకున్నది పెట్టెలో వున్న మిగతా వాళ్ళకు. ఎక్కడి వాళ్ళక్కడ తిరిగి సర్దుకు కూర్చున్నారు.

జీన్స్ వేసుకున్న అమ్మాయిలు అవమానంతో తలలెత్తలేకపోయారు. వోణీ అమ్మాయి ఏడుస్తూ సుబ్బమ్మ ఒడిలోకి వాలిపోయింది.

బండి మెల్లగా కదిలి వేగం అందుకున్నది.

"వూరుకోమ్మా! నీకేం భయంలేదు. ఆ వెధవలు గాని తిరిగి ఇటొస్తే ఎముకలిరిపేస్తాము" అన్నది గుడ్లెర్రజేస్తూ.

ఆ అమ్మాయి ధైర్యం తెచ్చుకుంటూ లేచి కూర్చుని బెక్కుతూ కళ్ళు తుడుచుకుంటున్నది.

బండి విజయవాడ ప్లాట్ ఫాం మీద కొచ్చి ఆగింది.

ప్రయాణీకులంతా బిలబిలమంటూ దిగి పోతున్నారు.

సుబ్బమ్మ కూడా గంప ఇవతలకు లాక్కుని మెల్లగా ప్లాట్ ఫాం మీదకు దిగి, గంప ప్రక్కగా పెట్టుకొని తల కుదురు చుట్టుకోసాగింది.

ఆమెతోపాటు దిగిన ఆడపిల్లలు సుబ్బమ్మ చుట్టూ మూగేరు.

"థాంక్స్!" అన్నారు ముక్త కంఠంతో. అంతకుమించి తమ కృతజ్ఞత ఎలా వెల్లడించుకోవాలో స్ఫురించలేదు వాళ్ళకు.

సుబ్బమ్మ పెదాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

"అమ్మలూ! ఆడోల్లం మగోరిలా బట్టలేసుకుని, జుత్తు కత్తిరించుకుని ఆల్లలాగెంతినంత మాత్రాన సమవుజ్జీలయిపోం. ఆల్లెందులో గొప్పంటే మీరందులో గొప్పనిపించుకోవాలి. ఎందులోనైనా పవితనం సూపాలి. మంచితనానికి సీతమ్మోరిలా పెద్దతనానికి కాళీకామ్మోరిలా గవ్వాల" అంటూనే చుట్టకుదురు నెత్తిమీద సర్దుకుని గంపెత్తుకుని జనంలో కలిసిపోయింది సుబ్బమ్మ.

సుబ్బమ్మ మాటలు ఈతరం ఆడపిల్లల గుండెల్లోంచి దూసుకెళ్ళి క్రొత్త ఆలోచనలు రేకెత్తించసాగాయి.

(స్వాతి సపరివార పత్రిక, 13-12-87)